క్లుప్తంగా

చింతల రాయుడి సేవలో ధర్మవరం సబ్ జడ్జి



కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేయిస్తున్న ధర్మవరం సబ్ జడ్జి గీతావాణి

తాడిపత్రి టౌన్: స్థానిక చింతల వెంకటరమణ స్వామి ఆలయాన్ని శనివారం ధర్మవరం సబ్ జడ్జి గీతావాణి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చింతల వెంకటరమణ స్వామి, ఆనందవల్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయంలోని శిల్ప సంపదను తిలకించారు. కార్యక్రమంలో తాడిపత్రి రూరల్ సీఐ చిన్న పెద్దయ్య దంపతులు, ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమావేశం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో శనివారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు రామ్మోహన్, కుళ్లాయి బాబు, వెంకటేష్, స్వర్ణాంబ, ఫకృద్దీన్ తదితరులు పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



చెత్తా చెదారం తొలగిస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శనివారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్ వర్కర్లు మురికి కాలువల్లో చెత్తా చెదారం తొలగించారు. అంతేకాకుండా అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీలు, శానిటరీ వర్కర్లు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న తిప్పన్న అనే వ్యక్తిని శనివారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. సెబ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిప్పన్న అనే వ్యక్తి గత కొన్ని నెలలుగా గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్టు సెబ్ పోలీసులకు సమాచారం అందింది. పక్కా సమాచారంతో శనివారం వేకువజామున సెబ్ ఎస్ఐ అలీఅహ్మద్ సిబ్బందితో కలిసి తిప్పన్న ఇంట్లో సోదాలు చేశారు. రహస్యంగా దాచి ఉంచిన నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. తిప్పన్నను అరెస్టు చేశారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచి జడ్జి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

రామరాజుపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు దేవరాజన్

యాడికి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామని రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి దేవరాజన్ తెలిపారు. మండలంలోని రామరాజుపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యుడు దేవరాజన్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇళ్ల వద్దకే వెళ్లి రోగుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్య , ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన



ఉచిత ధ్యాన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

తాడిపత్రి టౌన్: స్థానిక శివాలయం వీధిలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో జరుగుతున్న ఉచిత ధ్యాన ప్రత్యేక తరగతులు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి ఉచిత ధ్యాన ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి. ధ్యాన కేంద్రం నిర్వాహకులు రంగనాథరెడ్డి, కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి 10 వరకూ విద్యార్థులతో ధ్యానం చేయించారు. ధ్యానం, ప్రాణాయామం, మానవత విలువలు, ఆహార అలవాట్లు, గురువులు, పెద్దల పట్ల భక్తి భావంతోపాటు భగవద్గీత, ఆటలు, పాటలు, క్విజ్, డ్రాయింగ్, పెయింటింగ్‌పై అవగాహన కల్పించారు.

రంగు చూసి మోసపోవద్దు!

- మామిడి పండ్ల పక్వం కోసం కార్బైడ్
- కార్బైడ్ వాడకాన్ని నిషేధించిన ప్రభుత్వం

తాడిపత్రి: నవనవలాడుతూ మంచి రంగు తేలి ఆకర్షణీయంగా కనబడుతూ, ఘుమఘుమలాడుతూ తీయని రసమాధుర్యాన్ని అందించే మామిడి పండంటే ఇష్టముండనిదెవరికి..? మధుర ఫల ప్రియుల ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని, కొంత మంది మామిడి వ్యాపారులు హానికర రసాయనాలు వాడుతూ మామిడి పండ్లను బలవంతంగా మాగబెడుతున్నారు. పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు, ఆకర్షణీయమైన రంగు వచ్చేందుకు ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని పిచికారీ చేస్తున్నారు. ఇటువంటి మామిడి పండ్లను తినడం వలన క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడి తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు వంటి సమస్యలు వస్తాయని, జ్ఞాపకశక్తి నశిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

సంప్రదాయ, సాంకేతిక పద్ధతులే సురక్షితం

మామిడి పండ్లను మాగబెట్టడంలో సంప్రదాయ, సాంకేతిక పద్ధతులు పాటించడం ఎంతో మేలని సూచిస్తున్నారు. రైతులు క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఎగుమతులకు అనువుగా మాగబెడితే మంచి లాభాలు ఆర్జించడమే కాకుండా, ప్రజలకు సురక్షితమైన పండ్లను అందించినట్లవుతుందని చెబుతున్నారు. తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా 1,256 ఎకరాల్లో మామిడిని సాగు చేస్తున్నారు. అందులో తాడిపత్రి మండలంలో 869 ఎకరాల్లో, పెద్దపప్పూరు మండలంలో 292 ఎకరాల్లో, యాడికి మండలంలో 95 ఎకరాల్లో మామిడిని సాగు చేస్తుండగా, ఈ ఏడాది ఎకరాకు 2 నుంచి 3 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.



తోపుడు బండిపై విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు

కాల్షియం కార్బైడ్ ప్రమాదకరం



మామిడి కాయలపై కాల్షియం కార్బైడ్ పూయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఇలా వాడినట్లు తెలిస్తే ఫుడ్ సేఫ్టీ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. ఇటువంటి మామిడి పండ్లు తినడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రసాయనాలు పూసిన మామిడి పండ్లు తింటే నాలుక, పెదవులు మొద్దుబారినట్లు అనిపిస్తుంది. అలా అనిపిస్తే అటువంటి పండ్లను తినవద్దు. ఆరోగ్యకరమైన మామిడి పండ్ల ఉత్పత్తికి రైతులు, వ్యాపారులు, సురక్షిత పద్ధతులు పాటించాలి. కాల్షియం కార్బైడ్‌కు బదులు ఇథలిన్ గ్యాస్ చాలా తక్కువ హానికరమైనది. పండ్లను కృత్రిమంగా మాగబెట్టేందుకు దీని వాడకాన్ని పరిశోధన సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ప్రోత్సహిస్తున్నాయి.

– ఉమాదేవి, ఉద్యాన అధికారి, తాడిపత్రి

సహజ పద్ధతుల్లో మాగబెడతాం



గ్రామంలో 20 ఎకరాల పొలం ఉంది. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు మామిడికాయలను ఎగుమతి చేస్తుంటాం. పక్వానికి వచ్చిన కాయలను కోసి, గడ్డి, ఎండిన ఆకుల మధ్యలో కాయలను కొన్ని రోజుల పాటు ఉంచడం మూలంగా అవి మాగుతాయి. అలాంటి పండ్లను రెండు మూడు రోజులకోమారు బాక్సుల్లో ఉంచి విక్రయిస్తాం. ఇలాంటి పండ్లను తినడం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు రావు. ప్రతి ఒక్క రైతు సహజ పద్ధతుల్లో ఇలానే పండ్లను మగ్గపెడితే రేటు కూడా ఎక్కువగా పలికే అవకాశం ఉంటుంది.

– దస్తగిరి, రైతు, వ్యాపారి, పులిప్రొద్దుటూరు

తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నాం



ఏడాదికి ఒకసారి మార్కెట్లోకి వచ్చే మామిడి పండ్లను తినకుండా ఉండలేము. అలా అని అవి రసాయనాలు పెట్టి మాగబెట్టారా.. లేక సహజంగా మాగ బెట్టారా అన్నది ఆలోచించే పరిస్థితి అస్సలు ఉండదు. వాస్తవంగా రసాయనాలు వాడి పండ్లను మాగపెడితే కేవలం పండ్లు మంచి రంగు మాత్రమే వస్తాయి. కానీ రుచి ఉండవు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–విజయకుమార్, కొనుగోలుదారు, హుసేనాపురం

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి టౌన్: స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు జూన్ 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. కోపా, మెకానిక్ డీజిల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్, సివిల్ కోర్సులు ఉన్నాయన్నారు.

21న ఉచిత వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని సరస్వతీ ఉన్నత విద్యామందిరం ప్రాంగణంలో కిరణ్‌గౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ కిరణ్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. నరాలు, గైనిక్, షుగర్, కీళ్ల కండరాలు, ఫిజీషియన్లు, సర్జన్, బీడీఎస్ వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలతో పాటు మందులు అందజేస్తామన్నారు. ఉచిత భోజన వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ శిబిరానికి వచ్చే రోగులకు అదే రోజు ఉదయం 9 గంటల నుంచి టోకెన్లు అందజేస్తామన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయింపు

యల్లనూరు: మండలంలోని కోడిమూర్తి గ్రామంలో దళితుల శ్మశానవాటికకు 82 సెంట్లు స్థలాన్ని కేటాయించినట్లు తహసీల్దార్ రమాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సూచనలతో స్థలం కేటాయించడం జరిగిందన్నారు. దళితులెవ్వరూ ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు గాయాలు

గార్లదిన్నె: మండల పరిధిలోని తిమ్మంపేట సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ విధుల్లో భాగంగా కల్లూరుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. సంఘటన స్థలం వద్దకు రాగానే రోడ్డుపై పాము అడ్డుగా వచ్చింది. పామును తప్పించబోయి ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో సాయికుమార్ తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు.



చికిత్స పొందుతున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయికుమార్

గుత్తిలో..

గుత్తి: పట్టణంలోని కేంద్రియ విద్యాలయం సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. రాతన గ్రామానికి చెందిన రామన్న వ్యక్తిగత పని మీద ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలుదేరాడు. కేంద్రియ విద్యాలయం సమీపానికి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో రామన్న గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స కోసం ఆర్థికసాయం అందజేత

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని క్రిష్ణాపురం జీరో రోడ్డులో నివసిస్తున్న షంషాద్ అనే మహిళ గర్భకోశ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఫయాజ్‌బాషా ట్రస్టు చైర్మన్ ఫయాజ్‌బాషా శనివారం వైద్య ఖర్చుల నిమిత్తం తనవంతుగా రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, వైస్ చైర్మన్ మహబుబ్ బాషా, షెక్షావలి, జాఫర్, వలి, నూర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెస్ టోర్నీ



చెస్ ఆడుతున్న క్రీడాకారులు

అనంతపురం: అనంతపురంలోని రెయిన్‌బో మాంటిస్సోరి ప్రీ–స్కూల్‌లో ఆలిండియా చెస్ ఫెడరేషన్, వరల్డ్ చెస్ ఫెడరేషన్ సంయుక్త సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ చెస్ ఫర్ ఎవరీవన్ ఫైడ్ రేటెడ్ చెస్ టోర్నమెంట్–2023 రెండో రోజు శనివారం కొనసాగింది. ఆరో రౌండ్ పోటీలను ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కేర్ అండ్ క్యూర్ సీఈఓ అభిలాష్‌రెడ్డి, అమ్మినేని ఉదయ్‌కుమార్‌నాయుడు తదితరులు ప్రారంభించారు. క్రీడాకారులు పోటాపోటీగా చెస్ ఆడారు.

సజావుగా జాతీయ లోక్ అదాలత్

గుత్తి: పట్టణంలోని ఏడీజే, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 517 కేసులు పరిష్కారం అయ్యాయి. ఇన్‌చార్జ్ ఏడీజే శ్రీనివాసులు, సీనియర్ సివిల్ జడ్జి హరిత తదితరులు ఉదయం 10:30 గంటలకు లోక్ అదాలత్ ప్రారంభించారు. 458 ఎస్‌టీసీ కేసులను పరిష్కరించారు. అదే విధంగా 41 క్రిమినల్ కేసులు, 10 పీఎల్‌సీలు, 7 సివిల్ కేసులు, 1 ఎంవీటీపీ చొప్పున మొత్తం 517 కేసులను పరిష్కరించారు. బాధితులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్‌బాబు, ఏపీపీ బుస్సా సుధీర్‌రెడ్డి, ఏజీపీ తిమ్మారెడ్డి, సీనియర్ న్యాయవాదులు సతీష్ రెడ్డి, పరమేశ్వరరెడ్డి, సూరి, ఓబులేసు, రసూల్, నూర్ మహ్మద్, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుత్తి: కేసులను పరిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లులో 661 కేసుల పరిష్కారం

గుంతకల్లు: స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 661 కేసులు పరిష్కరించినట్లు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.నిర్మల తెలిపారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో జేసీజే కోర్టుకు సంబంధించి 21, రైల్వే కోర్టుకు చెందిన 33 కేసులు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సంబంధించిన 588 కేసులు, పీఎల్‌సీ కేసులు 19 మొత్తం 661 కేసులు ఉన్నాయి. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు సీ.వెంకటేశ్వర్లు, ఎం.నాగేషు, ఏపీపీ హేమలత, అడ్వకేట్లు లక్ష్మీపతి, లక్ష్మన్న, రవిశంకర్, గాదిలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

భద్రావతి భావనా రుషీశ్వరులకు పూజలు



అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డు సమీపంలోని మార్కేండేయ స్వామి ఆలయంలో భద్రావతి భావనా రుషీశ్వరుల కల్యాణ ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శనివారం ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, క్షీరాభిషేకం అనంతరం ప్రత్యేక పూలతో స్వామిని అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బహూత్తమ పద్మశాలీయ సంఘ కమిటీ ధర్మకర్త చెన్నా సూర్యనారాయణ, అధ్యక్షుడు గద్దం గణేష్, వైస్ ప్రెసిడెంట్స్ రంగప్రసాద్, రవికుమార్, జాయింట్ సెక్రటరీ గద్దం పరమేష్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

కొడవలితో బెదిరించి ఆటో ఎత్తుకెళ్లిన దొంగ

- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

లేపాక్షి: ఓ గుర్తు తెలియని వ్యక్తి హిందూపురం పట్టణంలో ఓ ఆటో డ్రైవర్ కళ్లలోకి కారం పొడి చల్లి, కొడవలితో బెదిరించి, ఆటో ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం లేపాక్షి మండలం పులమతి పంచాయితీ పరిధిలోని లయోలా పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్ వివరాలు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం హిందూపురం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న రహమత్‌పురానికి చెందిన ఫకృద్దీన్ అనే ఆటో డ్రైవర్ వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వెళ్లి హిందూపురం రూరల్ మండలంలోని కొటిపికి వెళ్లడానికి ఆటోను బాడుగకు మాట్లాడుకున్నాడు. లయోలా పాఠశాల సమీపంలోకి వెళ్లగానే గుర్తు తెలియని వ్యక్తి డ్రైవర్ కళ్లలోకి కారం పొడి చల్లి ఆటోను తీసుకెళ్లాడు. ఆటోడ్రైవర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మునీర్ అహమ్మద్ కేసు నమోదు చేసుకుని 24 గంటల్లోపు ఆటోతో పాటు ముద్దాయిని పట్టుకున్నారు. ముద్దాయి లేపాక్షి మండలం మానేపల్లికి చెందిన పిటి.ప్రసాద్ (20)గా గుర్తించారు. అయితే ముద్దాయి తన పొదుపు సంఘం డబ్బులు రూ.2 లక్షలను వ్యసనాలకు ఖర్చు చేసినట్లు నేరం అంగీకరించాడు. ముద్దాయిని అరెస్ట్ చేసి ఆటో నం.ఏపీ39 టీఎక్స్ 3044ను, కొడవలి, కారం పొడి ప్యాకెట్లు సీజ్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐలు

పర్యావరణాన్ని రక్షించుకుందాం



అడవిగొల్లపల్లి ఫారెస్ట్‌లో మొక్కలు నాటుతున్న ఎఫ్‌బీఓ శ్రీనాథ్

శెట్టూరు: మొక్కలునాటి పర్యావరణాన్ని రక్షించుకుందామని శెట్టూరు, కళ్యాణదుర్గం ఎఫ్‌బీఓలు శ్రీనాథ్, నాగేనాయక్ అన్నారు. శనివారం మండలంలోని అడవిగొల్లపల్లి ఫారెస్ట్‌లో 'లైఫ్ స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్టులో మొక్కలు నాటారు. అనంతరం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీవన విధానంలో మొక్కల పాత్ర, ప్రాముఖ్యత వివరిస్తూ, జీవ వైవిధ్యంలో మొక్కలు, గాలి, నేల, నీరు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి ముస్తాబు



రాయలచెరువులో అభయాంజనేయ స్వామిని పూలతో అలంకరించిన దృశ్యం



రాయలచెరువులో విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం

యాడికి: హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని రాయలచెరువులో ఏటా హనుమాన్ జయంతిని వైభవంగా నిర్వహిస్తారు. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ఉదయం నుంచి గ్రామంలోని చందన రైల్వే గేట వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు ప్రారంభించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. రెండు రోజుల పాటు పూజలు, హోమాలు చేస్తారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బాబు గౌడ్, పాండురంగడు తెలిపారు.

గార్లదిన్నె: మండల పరిధిలోని ముకుందాపురం, కల్లూరు, పెనకచెర్ల డ్యాం, బూదేడు, పాపినేపాళ్యం, క్రిష్ణాపురంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆలయాలను నిర్వాహకులు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అలాగే ముకుందాపురంలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి రాష్ట్రస్థాయి తాళాల భజన పోటీలు నిర్వహించారు.

నేడు రథోత్సవం

పామిడి: పట్టణ తలవాలకట్ట కోట వీధిలోని కోట వరాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ జయంతి, రథోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో కోరారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

కొత్తచెరువు: పర్యావరణ హితం కోసం ప్లాస్టిక్‌కు పాతర వేయాలని అటవీ శాఖ ఎఫ్ఎస్ఓ చంద్ర నాయక్ సూచించారు. మండలంలోని నారేపల్లిలో అటవీ శాఖ అధికారులు పర్యావరణం కొరకు జీవనశైలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రానాయక్ మాట్లాడుతూ కాలుష్య నివారణ కోసం ప్లాస్టిక్‌ను నిషేధించాలని, మొక్కలు పెంచాలన్నారు. పచ్చని చెట్లను సంరక్షించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సర్పంచ్ ప్రకాష్, మాజీ డీలర్ రమణారెడ్డి, ఫారెస్ట్ అధికారులు జయమ్మ, గంగాద్రి, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

రవిశంకర్ గురూజీ బోధనలు ఆదర్శప్రాయం

అనంతపురం కల్చరల్: యోగా గురువు రవిశంకర్ బోధనలు ఆదర్శప్రాయమని వక్తలు అన్నారు. రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు శనివారం స్థానిక ఆర్ట్ ఆఫ్ లివింగ్ సెంటరులో ఘనంగా జరిగాయి. సెంటర్ నిర్వాహకులు కర్నూలు మమత మాట్లాడుతూ సాధన, సేవ, సత్సంగం తదితర ప్రధాన అంశాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్న రవిశంకర్ గురూజీ మానవ జీవితంలో సమూల మార్పులు తెచ్చారని కొనియాడారు. జ్ఞానం, గానం, యోగా, వ్యాయామాలతోనే మనిషి ఆనందంగా జీవించగలరన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక, యోగా సంస్థల ప్రతినిధులు దేవరకొండ కౌసల్య, చలపతిరెడ్డి, సుబ్రమణ్యం, కరణం లక్ష్మీశ్రీధరరావు, మేకా జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



చేనేత కాలనీలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు



వడ్లపాలెంలో ఇలా..

ముట్టుకుంటే షాక్..

తాడిపత్రి టౌన్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలో రోజు రోజుకు విద్యుత్ ప్రమాదాలు అధికం అవుతున్నాయి. పట్టణంలో దాదాపు 240 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఉండగా.. వాటిలో సగానికి పైగా రక్షణ కంచె లేనివి ఉన్నాయి. అలాగే పలు వీధుల్లో విద్యుత్ వైర్లు ఇళ్లపైన, ఇళ్లకు ఆనుకుని ఉండటంతో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు చెపుతున్నారు. తాడిపత్రి పట్టణ విద్యుత్ శాఖ ఏఈ ఉదయ్‌బాస్కర్ సాక్షితో మాట్లాడుతూ.. పట్టణంలోని అన్నీ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె వేసేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రాణీనగర్‌లో మట్కా బీటర్ లక్ష్మీనారాయణను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మట్కా చీటీలతోపాటు రూ.14,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అతన్ని విచారించగా మట్కా కంపెనీకి సంబంధించిన డబ్బు తనతో షేక్ జిలాన్ అనే వ్యక్తి కట్టించుకుంటాడని చెప్పినట్లు పోలీసులు చెప్పున్నారు. దీంతో పోలీసులు కంపెనీతో సంబంధాలు నెరుపుతూ నగరంలో బీటర్లను ఏర్పాటు చేసుకున్న షేక్ జిలాన్ కోసం వెతుకుతున్నామని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

భర్త వేధింపుల నుంచి రక్షించండి

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని రాణీనగర్‌కు చెందిన రుబీనా, ఖాజాపీరా దంపతులు. వీరికి ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. అనుమానంతో భార్యను వేధిస్తుండటంతో విసిగిపోయిన రుబీనా పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఎలవగంప మహోత్సవం

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో 17వ వార్డు బీడుపల్లి గ్రామం మేకల చెరువు వద్ద వెలసిన అక్కదేవతల అమ్మవార్లకు ఆదివారం సాయంత్రం ఎలవ గంప మహోత్సవం ప్రారంభం అవుతుందని పూజారి చెన్నప్ప తెలిపారు. 15వ తేదీ 7 మంది పసిపిల్లలకు ఒడి నింపే కార్యక్రమం, రాజనాలు దంచే కార్యక్రమం జరుగుతుంది.